## సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలి

- పండుగ శుభాకాంక్షలు తెలిపిన మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నీలగిరి/సూర్యాపేట టౌన్, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరికీ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలంతా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. అలాగే మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తెలుగు ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కష్టాలు భోగి మంటల్లో కాలిపోవాలని, రైతులకు శుభం కలుగాలని, పండుగ తెచ్చే సంబురాలతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.






# పల్లె బాటన పట్నం

## సంక్రాంతికి ఇండ్లకు వస్తున్న జనం

- ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్లు, బస్సులు
- రద్దీగా మారిన విజయవాడ, వరంగల్ హైవేలు
- పంతంగి, గూడూరు టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్
- ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ చర్యలు
- అంతటా రంగవల్లులు, క్రీడా పోటీలు



నల్లగొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

యాదాద్రి భువనగిరి, జనవరి 13 (నమస్తే తెలంగాణ)/ రామగిరి : పల్లెకు పండుగొచ్చింది. సంక్రాంతి పండుగ షురూ అయ్యింది. బతుకుదెరువు కోసం పట్నం వెళ్లిన వాళ్లంతా పండుగకు వరుస సెలవులతో ఊళ్లబాట పట్టారు. దాంతో బస్టాండ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. జనంతో బస్సులన్నీ నిండి పోతున్నాయి. హైదరాబాద్ – విజయవాడ, హైదరాబాద్ – వరంగల్ హైవేలు వాహనాలతో రద్దీగా మారాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలు జరుగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మరో వైపు ఉమ్మడి జిల్లాలో అంతటా సంక్రాంతి ముగ్గుల పోటీలు, పతంగుల ఆటలు జోరుగా నడుస్తున్నాయి.

కొత్త ఆంగ్ల సంవత్సరంలో తొలుత వచ్చే పండుగ సంక్రాంతి. మూడు రోజుల పండుగ కావడంతో వరుసగా సెలవులు ఉంటాయి. దీంతో నగరాలు, పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారంతా తమ సొంతూర్లకు పయనమవుతారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపేందుకు మొగ్గు చూపుతారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. పండుగకు తోడు రెండో శనివారం రావడంతో మరింత కలిసొచ్చినట్లయ్యింది. ఇక జిల్లాలో ఉన్న ఆంధ్రా ఉద్యోగులు సైతం తమ ప్రాంతానికి క్యూ కట్టారు. చౌటుప్పల్, బీబీనగర్, బొమ్మలరామారం, భువనగిరిలో ఉన్న పలు కంపెనీల్లో పనిచేస్తున్న వారు ఆంధ్రా బాట పట్టారు.

### బస్టాండ్లు కిటకిట..

పండుగ ప్రయాణాలతో బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికులతో బస్టాండ్లన్నీ రద్దీగా మారిపోయాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత ప్రయాణం ఉండటంతో మరింత రద్దీ నెలకొంది. దీంతో బస్సులన్నీ పూర్తిగా నిండిపోతున్నాయి. కనీసం నిలబడి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతూనే జనం ప్రయాణాలు సాగిస్తున్నారు.

### హైవేలపై భారీగా రద్దీ..

ఉమ్మడి జిల్లా మీదుగా రెండు ప్రధాన జాతీయ రహదారులు వెళ్తున్నాయి. హైదరాబాద్ – విజయవాడ, హైదరాబాద్ – వరంగల్ హైవేలు ఉన్నాయి. ఏపీ ప్రజలకు సంక్రాంతి ముఖ్యమైన పండుగ కావడంతో హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి ఏపీకి పెద్ద ఎత్తున బయల్దేరారు. బస్సులు, సొంత వాహనాలైన కార్లు, బైక్‌లపై వెళ్తున్నారు. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తుండటంతో చౌటుప్పల్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అవుతున్నది. దీంతో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వరంగల్ హైవేపై బీబీనగర్ నుంచి ఆలేరు వరకు వాహనాల రద్దీ పెరిగింది. పంతంగి, గూడూరు, కొర్లపహాడ్ టోల్ ప్లాజాల వద్ద భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ పెద్ద సంఖ్యలో వచ్చే వాహనాలతో ఇబ్బందులు తప్పడం లేదు.



సూర్యాపేటలో ముగ్గు వేస్తున్న యువతులు

### ఇబ్బందులు లేకుండా చర్యలు

పండుగ రద్దీ నేపథ్యంలో అధికారులు, పోలీసులు ప్రణాళిక రూపొందించారు. హైవేలపై ట్రాఫిక్ జామ్ కాకుండా, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అదనపు సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ చేస్తున్నారు. చెక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. జంక్షన్ల వద్ద హైవేలకు ఇరువైపులా స్టాపర్లను ఏర్పాటు చేశారు. గూడూరు, పంతంగి టోల్ ప్లాజాల వద్ద కౌంటర్లను పెంచారు.

### సంక్రాంతి సంబురాలు షురూ..

సంక్రాంతి అంటేనే హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగురంగుల ముగ్గులు, పతంగుల ఆటలు. భోగి ఆదివారం అయినప్పటికీ గ్రామాల్లో అప్పుడే పండుగ శోభ సంతరించుకున్నది. పల్లెలు, పట్టణాలు పండుగ వాతావరణంతో కళకళలాడుతున్నాయి. మహిళలు, యువతులు ముగ్గులు వేస్తూ కనిపిస్తున్నారు. చిన్నాపెద్ద పతంగులు ఎగురవేస్తూ సంతోషంగా గడుపుతున్నారు. మహిళల కోసం అంతటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. పండుగ నేపథ్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి.



నల్లగొండ రామాలయంలో ఎదుర్కోలు మహోత్సవానికి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న అర్చకులు, భక్తులు

## రామాలయంలో నిరాటోత్సవం

- వైభవంగా స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు
- నేడు కల్యాణోత్సవం .. హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి, హైకోర్టు జడ్జి ఎంవీ శివకుమార్

రామగిరి, జనవరి 13 : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం నల్లగొండలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిరాటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, నల్లాన్‌చక్రవర్తుల రామకృష్ణమాచార్యులు తిరుప్పావై ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు దంపతులు, ఈఓ జయరామయ్య , ప్రముఖులు, అర్చకులు సముద్రాల యాదగిరాచార్యులు, శఠగోపాచార్యులు, రఘునందనాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

### వైభవంగా ఎదుర్కోలు..

గోదా, రంగనాయకస్వామి తిరుకల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

### నేడు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సం

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శతఘటాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కల్యాణ వేదికపై అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారు. కల్యాణోత్సవానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, హైకోర్టు జడ్జి ఎంవీ శివకుమార్‌తోపాటు ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

## యాదాద్రి డీటీఓ కార్యాలయంలో కొనసాగిన సోదాలు

భువనగిరి అర్బన్, జనవరి 13 : యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి డీటీఓ సురేందర్‌రెడ్డి గురువారం లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సంగతి తెలిసిందే. సురేందర్‌రెడ్డి డ్రైవర్ మల్లికార్జున్ పరారీలో ఉండగా.. కార్యాలయంలో ప్రైవేటుగా పనిచేసే సురేశ్‌తోపాటు మరో వ్యక్తి ఏసీబీ అధికారుల అదుపులో ఉన్నారు. కాగా శనివారం మరోసారి డీటీఓ కార్యాలయంతోపాటు ఇన్‌చార్జి డీటీఓ సురేందర్‌రెడ్డి ఇంట్లో సోదాలు చేశారు. పూర్తి ఆధారాలు రాబట్టే వరకు సోదాలు కొనసాగనున్నట్లు తెలుస్తున్నది.

## గండి చెరువుకు చేరిన కాళేశ్వరం జలాలు

యాదగిరిగుట్ట, జనవరి13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండకింద గండి చెరువులోకి మల్లన్నసాగర్ నుంచి కాళేశ్వరం జలాలు వచ్చి చేరుతున్నాయి. కొండకండ్ల గ్రామంలోని 15వ ప్యాకేజీ క్రాస్ రెగ్యులేటర్ వద్ద శుక్రవారం నీటిని విడుదల చేయగా రాత్రి 10 గంటలకు గండి చెరువులోకి వచ్చాయి. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో గండి చెరువులో సమృద్ధిగా నీటిని నిల్వ చేయాలన్న సంకల్పంతో జగదేవపూర్ డివిజన్–1 ఇరిగేషన్ అధికారులు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో రెండ్రోజులపాటు జలాలు రానున్నట్లు అధికారులు తెలిపారు.



యాదగిరిగుట్టలోని గండి చెరువులోకి వస్తున్న కాళేశ్వరం జలాలు

## అటెండెన్స్ యాప్‌పై స్పందన

- ఆసక్తి లేని వారు ప్రత్యామ్నాయ అటెండెన్స్ వినియోగించుకునే వెసులుబాటు : కలెక్టర్

సూర్యాపేట, జనవరి 13(నమస్తే తెలంగాణ) : జిల్లాలో నూతనంగా ప్రవేశపెట్టిన అటెండెన్స్ యాప్‌పై శనివారం 'నమస్తే తెలంగాణ' పత్రికలో అటెండెన్స్ యాప్‌పై అనుమానాలెన్నో? శీర్షికతో ప్రచురించిన వార్తకు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ స్పందించారు. అటెండెన్స్ యాప్‌పై అనుమానం, భయం ఉన్నవారు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ వ్యవస్థను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. యాప్‌ను ట్రెజరీకి అనుసంధానం చేయమని, అలాగే మొబైల్ లేని వారి కోసం ప్రత్యామ్నాయ మెకానిజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. చెక్ ఇన్, చెక్ అవుట్ సమయంలో మాత్రమే జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని, మిగిలిన సమయాల్లో ఉండదని, భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని తెలిపారు.






## కలెక్టర్, ఆర్డీఓకు హైకోర్టు నోటీసులు

నల్లగొండ మున్సిపల్ చైర్మన్ అవిశ్వాసంపై న్యాయస్థానంలో సవాల్

నీలగిరి, జనవరి 13 : నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై ఈ నెల 8న జరిగిన అవిశ్వాసంపై సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నల్లగొండ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ ఆ పార్టీకి చెందిన కొంత మంది కౌన్సిలర్లు విప్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసంలో ఓటు వేసిన విషయం తెలిసిందే. తనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి చైర్మన్‌గా అబ్బగోని రమేశ్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు జడ్జి జిల్లా కలెక్టర్, ఆర్డీఓలతోపాటు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. అవిశ్వాసం ఓటింగ్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

## కేసీఆర్ హయాంలోనే పట్టణాల ప్రగతి

- మున్సిపాలిటీలకు జాతీయ అవార్డులే అందుకు నిదర్శనం
- ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ



కొండూరు సత్యనారాయణ

నల్లగొండ రూరల్, జనవరి 13 : మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పట్టణాల్లో చేపట్టిన ప్రగతి కళతోనే నేడు జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు లభించాయని ఎంబీసీ జాతీయ కన్వీనర్, మున్సిపల్ కో ఆప్షన్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి జాతీయ అవార్డులతోపాటు 8 చెత్త రహిత పట్టణాలు, 2 వాటర్ ప్లస్ పట్టణాలు, 77 ఓడీఎఫ్ పట్టణాలు, 45 ఓడీఎఫ్ ప్లస్ పట్టణాలుగా ఎంపికైనట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో లక్ష జనాభా పైబడిన నల్లగొండ మున్సిపాలిటీకి జాతీయస్థాయిలో 92వ, రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ రావడం హర్షణీయమని పేర్కొన్నారు. గత మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పనితీరుతోనే రాష్ట్రానికి జాతీయ స్థాయిలో అవార్డులు దక్కాయని తెలిపారు.

# చౌటుప్పల్‌లో ట్రాఫిక్ రద్దీ

- 5 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- తీవ్ర ఇబ్బందులు పడిన స్థానిక ప్రయాణికులు
- రోజంతా ఇదే పరిస్థితి



చౌటుప్పల్ పట్టణంలో విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్, జనవరి13 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో శనివారం ట్రాఫిక్ రద్దీ కొనసాగింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో నగరవాసులు పల్లెబాట పట్టారు. దాంతో పట్టణ కేంద్రంలో రెండో రోజూ రద్దీ నెలకొంది. 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోజంతా ఇదే పరిస్థితి కనిపించింది. పోలీసులు సంస్థాన్‌నారాయణపురం క్రాస్‌రోడ్డును మూసివేశారు. ఈ వైపు వెళ్లే వాహనాలు వలిగొండ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకొని వెళ్లాల్సి వచ్చింది. బస్టాండ్ మార్గాన్ని కూడా మూసివేయడంతో స్థానిక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దాంతో కేవలం ద్విచక్రవాహనదారులు, పాదచారులను మాత్రమే అక్కడి నుంచి పంపించారు. పెద్ద వాహనాలను అనుమతించలేదు. నల్లగొండ వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులు బస్టాండ్ లోపలికి వెళ్లలేదు. లోపలికి రావాలంటే ధర్మోజిగూడెం క్రాస్‌రోడ్డు వద్ద యూటర్న్ తీసుకోవాలి. దూరభారం పెరుగడంతో జాతీయ రహదారిపైనే ప్రయాణికులను ఎక్కించుకున్నారు. హైదరాబాద్ నుంచి చౌటుప్పల్‌కు నడిచిన బస్సులు వలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద యూటర్న్ తీసుకొని వెళ్లాయి. పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసినప్పటికీ వాహనదారులు లక్కారం సర్వీస్ రోడ్డు వెంట వెళ్లారు. సర్వీసు రోడ్డు కూడా రద్దీగా మారింది. పోలీసులు అక్కడి నుంచి పెద్ద వాహనాలను అనుమతించలేదు. అంతేకాకుండా వాహనదారులు మధ్యాహ్నం తర్వాత ధర్మోజిగూడెం క్రాస్‌రోడ్డు నుంచి వ్యతిరేక మార్గంలో వెళ్లారు. దాంతో కొద్దిసేపు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది.

### 65 వేలకు పైగా వాహనాలు..

చౌటుప్పల్ రూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం భోగి ఉండడంతో హైదరాబాద్ నుంచి ఆంధ్రాకు ఎక్కువ మంది వాహనాల్లో వెళ్లారు. పంతంగి టోల్ గేట్ నుంచి శనివారం ఉదయం మొదలు సాయంత్రం 6 గంటల వరకు 65 వేల వాహనాలు వెళ్లినట్లు జీఎంఆర్ అధికారులు తెలిపారు. చౌటుప్పల్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


